
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 27 సెప్టెంబరు 2024





- వానాకాలం, యాసంగిలో 2.48లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్
- ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వకుండా మిల్లర్ల కుంటిసాకులు
- మిల్లుల్లోనే మూడు సీజన్లకు సంబంధించిన ధాన్యం
- రేషన్ బియ్యాన్ని సీఎంఆర్‌గా మార్చేందుకు కొందరి యత్నాలు
- మిల్లుల్లో అక్రమాలపై విజిలెన్స్ దాడులు.. యజమానులపై క్రిమినల్ కేసులు

మిల్లర్ల దొంగాట!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఎంఆర్ లక్ష్యం చేరని మిల్లులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు మిల్లుల్లో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిల్వలు పేరుకుపోతున్నాయి. నిర్ణీత గడువులోపు సీఎంఆర్ ఇవ్వకుండా ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల శాఖతో మిల్లర్లు దొంగాట ఆడుతున్నారు. 2023-24లో వానాకాలం, యాసంగిలతో పాటు 2022-23 యాసంగి పంటలకు సంబంధించిన సీఎంఆర్ లక్ష్యాలను మిల్లర్లు పూర్తి చేయటం లేదు. ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లింగ్ కోసం ఇస్తే, మిల్లర్లు అడ్డదారిలో అక్రమ వ్యాపారం చేస్తున్నారు. పీడీఎస్ బియ్యాన్ని వివిధ రూపాల్లో సేకరించి తిరిగి ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల శాఖకు మిల్లర్లు అప్పగిస్తున్నారు. రీసైక్లింగ్ చేసిన బియ్యాన్ని అంటగడుతూ మిల్లర్లు కోట్లాది రుపాయల అక్రమ దందాకు పాల్పడుతున్న విషయాన్ని పసిగట్టిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు.. దాడులు నిర్వహిస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మిల్లర్ల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి.

రైతుల నుంచి మిల్లర్లకు

ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సేకరిస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2023-24 సంవత్సరంలోని వానాకాలంలో 4,26,576 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. అలాగే యాసంగిలో 5,16,974 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. మొత్తం 9,43,550 మెట్రిక్ టన్నుల వడ్లను కొనుగోలు చేసి మారాడించేందుకు (సీఎంఆర్) మిల్లర్లకు అప్పగించింది. మిల్లర్లు క్వింటాల్ వడ్లకు 67కిలోల చొప్పున సీఎంఆర్‌ను తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలి. వడ్లను మరాడించినందుకు ప్రభుత్వం మిల్లర్లకు చార్జీలు చెల్లిస్తుంది. అయితే నిర్ణీత సమయంలో మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యాన్ని అప్పగించాల్సి ఉన్నప్పటికీ మిల్లర్లు లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయటం లేదు. సీఎంఆర్ గడువును ప్రభుత్వం పలుమార్లు పొడిగించినా ఫలితం లేకుండా పోతోంది.

ఓరుగల్లులో అధిక మొత్తంలో పెండింగ్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఎంఆర్ నిల్వలు అధికమొత్తంలో పెండింగ్‌లో ఉంటున్నాయి. 2023-24 వానాకాలంలో ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,26,576 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈ ధాన్యాన్ని మరాడించి 2,85,972మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,21,268 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే మిల్లర్లు అప్పగించారు. సుమారు ఏడాది కాలంగా ఇంకా 64,702 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించటం లేదు. అత్యధికంగా ములుగు జిల్లా నుంచి 15,219 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి చేరాల్సి ఉంది. అలాగే మహబూబాబాద్ జిల్లా నుంచి 12,179మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. అలాగే ఇదే ఏడాది యాసంగిలో ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని 5,16,974 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి మిల్లర్లుకు మరాడించేందుకు సరఫరా చేశారు. ఈ ధాన్యంతో 3,50,492 మెట్రిక్ టన్నులే కస్టమ్ మిల్లింగ్ రైస్ అందించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,66,737 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందించారు. ఇంకా 1,83,171 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 50,773మెట్రిక్‌ల సీఎంఆర్, జనగామ జిల్లాలో 42,983 మెట్రిక్ టన్నులు, వరంగల్ జిల్లాలో 38,144 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. ఖరీఫ్, యాసంగిలో కలిపి మొత్తం 2,47,873 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉంది. గత 2022-23లో యాసంగి ధాన్యంకు సంబంధించి కూడా ఇంకా 50వేల మెట్రిక్ టన్నుల

మిగతా 7వ పేజీలో..

2023-24 వానాకాలంలో సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	మిల్లర్లకు ధాన్యం	సీఎంఆర్	మిల్లర్లు ఇచ్చింది	సీఎంఆర్ పెండింగ్
వరంగల్	56,968	38,256	29,164	9,092
హనుమకొండ	79,161	53,117	44,827	8,290
జనగామ	80,864	54,179	44,449	9,730
మహ-బాద్	56,775	38,039	25860	12,179
భూపాలపల్లి	51,620	34,585	24,391	10,194
ములుగు	1,01,188	67,796	52,577	15,219
మొత్తం	4,26,576	2,85,972	2,21,268	64,702

2023-24 యాసంగిలో సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	మిల్లర్లకు ధాన్యం	సీఎంఆర్	మిల్లర్లు ఇచ్చింది	సీఎంఆర్ పెండింగ్
వరంగల్	1,04,133	70,588	32,444	38,144
హనుమకొండ	1,37,820	93,457	42,684	50,773
జనగామ	1,42,806	97,018	54,025	42,983
మహ-బాద్	31,103	21,150	13,804	7,340
భూపాలపల్లి	57,683	39,182	18,444	20,170
ములుగు	43,429	29,097	5,336	23,761
మొత్తం	5,16,974	3,50,492	1,66,737	1,83,171

రేషన్ రీసైక్లింగ్‌తో సీఎంఆర్‌కు..

సీఎంఆర్ విధానంలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. ధాన్యం తీసుకున్న మిల్లర్లు గడువులో పు మరాడించి బియ్యాన్ని అప్పగించాల్సి ఉన్నా కొందరు మిల్లర్లు ప్రభుత్వ ధాన్యంతో అక్రమ వ్యాపారం చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యాన్ని మిల్లర్లు మరాడించి, ఆ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి వ్యాపారం చేస్తున్నారని తెలుస్తోంది. ఇటీవల దాడుల్లో బియ్యం పక్కదారి కేసులో అధికంగా వెలుగులోకి వస్తున్నాయి. రుపాయి పెట్టుబడి లేకుండా మిల్లర్లు లక్షల్లో దందా సాగిస్తున్నారు. ఒకవేళ నిర్ణీత కాలంలో బియ్యం అప్పగించాలని అధికారులు ఒత్తిడి చేస్తే రేషన్ బియ్యాన్నే రీసైక్లింగ్ చేసి అప్పగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ నేతలు, అధికారుల అండతో కొందరు మిల్లుల నిర్వాహకులు డీలర్లు, దళారుల వద్ద కిలో రూ.10 నుంచి రూ.12 వరకు కొనుగోలు చేసి, వాటికి పాలిష్ చేసి సీఎంఆర్ అప్పగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ధాన్యాన్ని మరాడించి బయట మార్కెట్‌లో కిలో రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న మిల్లర్లు.. రేషన్ బియ్యాన్ని గ్రామాల్లో వివిధ రూపాల్లో రూ.10కి కొనుగోలు చేసి రీసైక్లింగ్‌తో ప్రభుత్వానికి అప్పగిస్తూ రూ.లక్షల్లో అక్రమార్జనకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అద్భుతాల నెలవు..

- పర్యాటక ప్రాంతాల కూడలి ఓరుగల్లు
- కాకతీయ కాలం నాటి ఆలయాలు.. రమణీయ ప్రకృతి ప్రదేశాలు సొంతం
- ఏటా లక్ష మందికిపైగా సందర్శకుల రాక
- అయినా పర్యాటకాభివృద్ధికి చర్యలు అంతంత మాత్రమే
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



చారిత్రక వారసత్వ సంపద.. అద్భుత శిల్పకళతో అలరారుతూ ఆధ్యాత్మికత తొణికిసలాడే పురాతన ఆలయాలు.. ప్రకృతి రమణీయ అరణ్యాలు.. మైమరిపింపజేసే జలపాతాలు ఉమ్మడి వరంగల్ జిల్లా సొంతం. ఎన్నో అద్భుతాలకు నెలవైన ఓరుగల్లు.. వెయ్యేళ్లకు పైగా చరిత్రకు సాక్ష్యంగా, ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా ఉన్న కాకతీయ కట్టడాలు, సుందర సరస్సులు, అందమైన చెరువులను సిగలో దాచుకుంది. దట్టమైన అడవుల్లో కొండల మధ్య కనువిందు చేసే జలపాతాలే కాదు.. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, ఆ అడవి మధ్యన కొలువైన సమ్మక్క సారక్కల క్షేత్రం నుంచి రాష్ట్ర రెండో రాజధా ని స్థాయిలో అభివృద్ధి చెందుతున్న ట్రైసిటీలోని వేయి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయాల వరకూ అన్నీ అద్భుతాలే దర్శనమిస్తాయి. వీటిని తిలకించి తరించేందుకు ఏటా లక్ష మందికిపైగా వస్తుంటారు. ఇంతలా పర్యాటకంగా ఆకట్టుకుంటున్న ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చొరవ మాత్రం అంతంతమాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



- హనుమకొండ

వివరాలు 7లో..

కలెక్టర్‌ను అభినందించిన పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 26 : రాష్ట్రంలోనే రెండవ అత్యధిక యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసినందుకు గాను కలెక్టర్ సత్యశారదను రాష్ట్ర పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.వాణిప్రసాద్ అభినందించారు. ఈనెల 27న రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగే ప్రపంచ పర్యాటక దినోత్సవంలో పాల్గొనాల్సిందిగా కలెక్టర్‌ను ఆహ్వానించారు. దేశ యువతలో టూరిజం సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన పెంచాలనే ఉద్దేశ్యంతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌లను ఆదేశించింది. ఇందులో భాగంగా కలెక్టర్ సత్యశారద అధికారులతో పలుమార్లు సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేయడంతో రాష్ట్రంలోనే వరంగల్ జిల్లా అత్యధికంగా యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటులో రెండవ స్థానం కైవసం చేసుకుంది.

సృజనాత్మకతను వెలికి తీయడానికే వైజ్ఞానిక ప్రదర్శనలు

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద

మట్టెవాడ, సెప్టెంబరు 26: విద్యార్థుల్లోని సృజనాత్మకత, నైపుణ్యతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహద పడతాయని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను సామాజిక సమస్యలకు పరిష్కారం చూపేలా వారి ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావడంతో పాటు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయుక్తమవుతాయన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలనే ఉద్ధేశ్యంతో జిల్లా స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇక్కడి ప్రదర్శనలు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించబడాలని కలెక్టర్ ఆకాక్షించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటున్న విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డీఐఈవో, డిగ్రీ కాలేజీ నోడల్ అధికారి నవీన్, జిల్లా సైన్స్ అధికారి, కోకన్వీనర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ భుజంగరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి కోడిమాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- బల్దియాలో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు



కార్మికులకు హెల్త్‌కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే నాయిని, మేయర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 26: గ్రేటర్ వరంగల్ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బంది ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. స్వచ్చతా హీ సేవా-2024లో భాగంగా బల్దియా ఇండోర్ స్టేడియంలో గురువారం పారిశుధ్య కార్మికులకు, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ సిబ్బందికి ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వారి సహాయంతో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు చేశారు. నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు హెల్త్ కార్డులు, హెల్త్ పీపీఈ కిట్లు అందజేశారు.

ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బల్దియాలో చాలా మంది నిరుపేద మహిళా కార్మికులే విధులు నిర్వర్తిస్తున్నారని, వారి ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య పరీక్షలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పారిశుధ్య కార్మికులతో పాటు కుటుంబ సభ్యులు కూడా సంతోషంగా ఉండాలండే పరిశుభ్రతను పాటించాలన్నారు.

మిగతా 8వ పేజీలో..


రౌడీషీటర్లపై కఠినంగా వ్యవహరించాలి

- బాధితులకు సత్వరమే న్యాయం అందించండి
- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



నేర సమీక్షలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, సెప్టెంబరు 26: రౌడీషీటర్లపై కఠినంగా వ్యవహరించాలని, పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితులకు చట్టాలకు లోబడి న్యాయం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో గురువారం నేర సమీక్షా సమావేశం జరిగింది. స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, కేసుల పురోగతి వివరాలను సీపీ సమీక్షించారు. అనంతరం అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీతో పాటు శాస్త్రీయ పద్ధతిని అనుసరిస్తూ కేసుల దర్యాప్తు చేపట్టాలన్నారు. దర్యాప్తులో ఉన్న కేసుల్లో వీలైనంత వరకు బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రజావాణి, డీజీపీ కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించాలని సీపీ సూచించారు. బాలికలు, మహిళల మిస్సింగ్ కేసుల్లో అలసత్వం వహించకూడదన్నారు. స్టేషన్ల పరిధిలో నిరంతరం కార్డన్ సెర్చ్‌లు నిర్వహించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



నేడే బ్రహ్మాండమైన విడుదల



యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- ప్రొఫెసర్లు నారాయణ, వెంకయ్య
- కేయూలో పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాలు



వర్సిటీలో ర్యాలీ తీస్తున్న పీడీఎస్‌యూ విద్యార్థులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 26: యువతతో పాటు అందరూ శాస్త్రీయ దృక్పథంతో ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు పిలుపునిచ్చారు. గురువారం కేయూలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ నేతృత్వంలో 50వ స్వర్ణోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ మొదటి గేటు నుంచి రెండో గేటు వరకు భారీ ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన సభలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన కేయూ ప్రొఫెసర్లు ఈసం నారాయణ, వై.వెంకయ్య పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధికి ప్రధాన ఆటంకంగా మారిన కులం, మతం, లింగం, ఆర్థిక అసమానతలను కూకటి వేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. దోపిడీ, పీడన, అణచివేత లేని సమానత్వ సమాజ స్థాపనకు విద్యార్థులందరూ శాస్త్రీయ దృక్పథంతో కూడిన ప్రశ్నించేతత్వాన్ని, ప్రజాస్వామిక లక్షణాలను అలవర్చుకోవాలని అన్నారు. పీడీఎస్‌యూ యువతలో ప్రగతిశీల భావాలను నింపి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటలను నిర్వహించిందని పేర్కొన్నారు. ప్రాశ్చాత్య సంస్కృతిలో యువతలో ప్రగతిశీల భావాలను లోపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్, మారకద్రవ్యాలు, ధూమపానం, మద్యపానంలాంటి దురవాట్లకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత నిండు జీవితాలను నాశనం చేసుకుని కన్న తల్లిదండ్రులను ఆశలను అవిరి చేస్తున్నారని వివరించారు. దేశంలో విద్యా రంగంలో వస్తున్న మార్పులు దళిత, గిరిజన, అట్టడుగు పేద వర్గాలకు గొడ్డలిపెట్టుగా మారుతున్నాయని అన్నారు. దేశంలో ఉచిత, నాణ్యమైన కామన్ విద్యను అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొఠారి కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని అన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయకార్యదర్శి కంపాటి పృథ్వీ, పూర్వ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవి, రాష్ట్రనాయకులు ముల్క రవి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు, జిల్లా నాయకులు వినయ్, సంగీత, స్వాతి పాల్గొని మాట్లాడారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, వలసలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ 50 ఏళ్ల ప్రస్థానంలో విద్యారంగ సమస్యలతో పాటు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు చేసిందన్నారు. విద్యార్థుల్లో సమాజంలో ప్రగతిశీల నింపిందన్నారు సభ ప్రారంభంలో పీడీఎస్‌యూ విప్లవ విద్యార్థి అమరులైన జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీహరి, బొమ్మ సాంబయ్య, కోలా శంకర్, దుగ్గ చేరాలు, రంగవల్లి, మధు సూదన్, రాజ్, వరహాలు, రమణయ్య, చాంద్ పాషా, మారోజు వీరన్నలాంటి అమరవీరులకు స్మరిస్తూ మౌనం పాటించి నివాళులర్పించారు.

29న ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 26: వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు అక్టోబరు 4 నుంచి 6వరకు కామారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఒరిజనల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకొని ఈనెల 29న ఉదయం 8గంటలకు జేఎన్‌లోని బాడ్మింటన్ కోర్టులో రిపోర్టు చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 9849201467 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.



ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్

కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 26: బీసీలకు రాజ్యాధికారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. ఆధిపత్య వర్గాలు పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీల స్ఫూర్తితో బీసీలకు రాజ్యాధికారం సాధిస్తామని తెలిపారు. బీసీల ఉద్యమాన్ని రాజ్యాధికారం దిశగా పయనింపచేసేందుకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం నిర్వహించిన బీసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో త్వరలోనే బీసీల భారీ బహి రంగ సభ నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా బీసీల హక్కులను గుర్తించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినప్పటికీ ఇంతవరకు అమలు చేయకపోవడం బీసీలకు తీవ్ర నిరాశను కలిగించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల హక్కుల కోసం పోస్టు కార్డు ఉద్యమాలు, నిరాహార దీక్షలు, ర్యాలీలు, మహా ధర్నాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన వివరించారు. తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైన వరంగల్ నుంచే ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉద్యమ సంఘాలను సమీకరించి ఉద్యమాన్ని తీవ్రం చేయనున్నట్లు, బీసీ ఎమ్మెల్యేలు ఇకనైనా కళ్లు తెరిచి బీసీలు కోరుతున్నట్లుగా రాష్ట్రంలో కులాల జనగణనకు మద్దతు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దారం జనార్దన్, ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుట్టి శ్యాం యాదవ్, ప్రొఫెసర్ తిరునహరి శేషు, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు కవిత పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26: విదేశాల్లో ఉద్యోగావకాశాల కోసం టామ్‌కామ్ నిర్వహిస్తున్న ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా జిల్లా ఎంప్లామెంట్ ఆఫీసర్ సీహెచ్.ఉమారాణి గురువారం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగల, అర్హతగల వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గల్ఫ్‌దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరీ, జపాన్, పోలండ్, రుమేనియా యూకే లాంటి దేశాల్లో ఉద్యోగాలు చేసేందుకు టామ్‌కామ్ అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్ పూర్తి చేసి కనీసం రెండు నుంచి నాలుగేళ్ల అనుభవం ఉండి 20 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్కులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 9985483931/ 7995957779/ 7893566493 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా మురళి

- కేఎంసీ ప్రిన్సిపాల్‌గా రామ్‌కుమార్‌రెడ్డి
- ములుగు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా మోహన్‌లాల్



మురళి



రామ్‌కుమార్‌రెడ్డి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 26: ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ సీహెచ్.మురళికి పూర్తి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ జీవో ఆర్‌టీ నెంబరు 562ను విడుదల చేశారు. డాక్టర్ మురళి జూలై 23న డాక్టర్ చంద్రశేఖర్ బదిలీపై వెళ్లిన సమయంలో సూపరింటెండెంట్‌గా చార్జి తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వేచి చూశారు. అదేవిధంగా కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. హనుమకొండలోని టీబీ, ఛాతివ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.సునీత నియమితులయ్యారు. ములుగు జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి.మోహన్‌లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు ఆర్‌సీ నెంబరు 41208/డి-1/2024ను విడుదల చేసింది.



వేడుకల్లో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

ఉత్కర్ష వేడుకలతో సందడిగా కేఎంసీ

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 26: కాకతీయ వైద్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్కర్ష-24 వేడుకల్లో భాగంగా ఆరోరోజు అయిన గురువారం ట్రెజర్ హంట్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు నిధి కోసం సమూహాలుగా ఏర్పడి ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం ఫ్యాషన్ షో ఏర్పాటు చేయగా, వైద్య విద్యార్థులు వివిధ వేషాధారణలో సందడి చేశారు. డీజే పాటలతో ఉత్సాహంగా నృత్యాలు చేసి వైద్య విద్యార్థులు అలరించారు.

అద్భుతాల నెలవు..

● పర్యాటక ప్రాంతాల కూడలి ఓరుగల్లు ● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

హనుమకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి రమణీయ ప్రదేశాలు.. సుప్రసిద్ధ ఆలయాలు.. చారిత్రక వారసత్వ సంపద కలగలిసిన ఉమ్మడి వరంగల్‌జిల్లా రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రాలకు నిలయంగా పేరొందింది. వెయ్యేళ్లకు పైగా చరిత్రకు సాక్ష్యంగా, ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా ఉన్న కాకతీయ కట్టడాలు, అబ్బురపరిచే శిల్ప సౌందర్యంతో అలరారే ఆలయాలు, సుందర సరస్సులు, అందమైన చెరువులెన్నో ఓరుగల్లు సిగలో మణిహారాలుగా ఉన్నాయి. దట్టమైన అడవుల్లో కొండల మధ్య నిండుకుండల్లా కనువిందు చేసే రామప్ప, లక్నవరం, పాకాల, గణపురం, ధర్మసాగర్, కటాక్షపురం, భద్రకాళి చెరువులతో కూడిన ఎకో టూరిజం ఓవైపు, గోదావరి పరీవాహక ప్రాంతంలోని తాడ్వాయి, ఏటూరునాగారం అభయారణ్యం (టైగర్ పార్క్) మొదలుకొని పాకాల సరస్సు పరిసర ప్రాంతాల్లోని అభయారణ్యం (జింకల పార్క్)లతో కూడిన గిరిజన ఆవాసాల ట్రైబల్ టూరిజయం మరోవైపు, ప్రాచీన చారిత్రకు కట్టడాలతో ముడిపడిన హెరిటేజ్ టూరిజం ఇంకోవైపు సందర్శకులకు కనువిందు చేస్తాయి. ఇలాంటి జీవ వైవిధ్య పర్యాటకం ఒక్క వరంగల్ జిల్లాకే సొంతం. కాకతీయు చరిత్ర, నాటి వైభవాన్ని చాటే వరంగల్ కోట, వేయిస్తంభాల గుడి, రామప్పగుడి, కోటగుళ్లు, జఫర్‌గడ్ కోట, భద్రకాళి దేవాలయం, ఐనవోలు, పాలకుర్తి, మల్లూరు ఆలయాలు, పాండవులగుట్టలోని రాక్ పెయింటింగ్ తదితర పర్యాటక ప్రాంతాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, వాటి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేక కథనం. అయితే ప్రభుత్వం ఈ పర్యాటక ప్రాంతాలను చూసేందుకు వచ్చేవారి వసతి కోసం రూ.88 కోట్ల వ్యయంతో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హరిత హటళ్లను నిర్మించింది.

ఎన్నో ఆధ్యాత్మిక ఆనవాళ్లు..

యునెస్కో గుర్తింపుపొందిన రామప్ప ప్రపంచ వారసత్వ సంపదగా ఉమ్మడి వరంగల్ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసింది. ములుగు జిల్లా కేంద్రానికి 15కి.మీ. దూరంలో వెంకటాపూరం మండలం పాలంపేట గ్రామంలో ఉన్న ఈ ఆలయం కాకతీయ అపురూప శిల్పకళావైభవానికి ప్రతీకగా నిలిచింది. ఆలయం ఎదురుగా ఉన్న నంది జగత్ప్రసిద్ధమైంది. రామప్ప ఆలయాన్ని అనుకొని సరస్సు ఉండటంతో ప్రకృతి సోయగాలు పర్యాటకుల సొంతమవుతున్నాయి. సకల దేవుళ్ల సాక్షాత్కారం. శివకేశం సమారాధనగా, భూలోకకైలాసంగా ఏకకూట ఆలయంగా నిర్మించడం ఇక్కడి విశిష్టత. కాకతీయుల నాటి అద్భుత నిర్మాణంగా.. హనుమకొండ నడిబొడ్డున ఉన్న శ్రీ రుద్రేశ్వర స్వామివారి వేయిస్తంభాల గుడి భాసిల్లుతోంది. క్రీశ.1163లో కాకతి రుద్రమ దేవుడు నిర్మించిన ఈ త్రికూటాలయంలోని ఎత్తైన పానవట్టంపై వేంచేసిన శివలింగం నుంచి మండప నిర్మాణం, జీవం ఉట్టిపడేలా కనిపించే నందీశ్వరుడి విగ్రహం వరకూ అన్నీ అద్భుతాలే. ఇక ఓరుగల్లు ప్రజలకు ఇలవేల్పుగా విరాజిల్లుతున్న భద్రకాళి దేవాలయాన్ని క్రీస్తుశకం 10వ శతాబ్దంలో ఎర్ర భూపాలుడు నిర్మించాడు. భద్రేశ్వరీ అనే మరో పేరు కూడా భద్రకాళి దేవికి పూజలందుకుంటున్నారు. దేశంలోని ప్రసిద్ధ దేవాలయల్లో ఒకటిగా శక్తిపీఠంగా ప్రసిద్ధి చెంది.. ఒక పక్క చెరువు, మరో పక్క కొండలు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య నిత్య ధూప, దీప నైవేద్యాలతో కీలక ఉత్సవాలతో ఈ ఆలయం వెలుగొందుతోంది. హనుమకొండలోని మరో దర్శనీయ స్థలం పద్మాక్షి దేవాలయం. కాకతీయరాజుల మూల పురుషుడు మాధవ వర్మ క్రీ.శ 4వ శతాబ్దిలో తమ ఆరాధ్య దేవతైన పద్మాక్షికి ఆలయాన్ని దీనిని నిర్మించాడు. చుట్టూ ఎత్తైన కొండలు, ప్రకృతి అందాలతో ఈ ప్రాంతం అలరారుతోంది. ఈ గుడికి దగ్గరలోనే మహిమాన్వితమైన ప్రాచీన సిద్ధేశ్వరాలయం, జైనతీర్థంకులు కొలువుదీరిన అగ్గలయ్య గుట్ట ఉంది. ఇటీవలే దీనిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు. వీటితో పాటు హనుమకొండ జిల్లా కేంద్రం నుంచి సుమారు 15 కి.మీ. దూరంలో ఉన్న కాకతీయుల కాలం నాటి మరో ఆలయం ఐనవోలు మల్లికార్జునస్వామి దేవాలయం. ప్రతీ ఏటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు మహాజాతర జరగడం ఇక్కడి ప్రత్యేకత. క్రీ.శ 11వ శతాబ్దంలో ఈప్రాంతాన్ని పాలించిన త్రిభువనమల్లుడి కాలంలో ఈ ప్రాంతాన్ని అయ్యనవోలు అని పిలిచేవారని, అందుకే దీనికి ఐనవోలు అని పేరొచ్చినట్లు శాసనాలు చెబుతున్నాయి. కాకతీయుల సామంతుడైన అయ్యన మంత్రి ఈ ఆలయాన్ని కట్టించాడు. ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రానికి ఒక కిలోమీటర్ దూరంలోని మల్లూరులోని హేమాచల కొండపై వేంచేసిన లక్ష్మీనరసింహుడు ఉగ్రరూపంలో ఉన్న అర్చామూర్తిగా పూజలందుకుంటున్నాడు. ఐదు దశాబ్దాల కిందట దీపకర్ణి అనే రాజు ఈ ఆలయాన్ని నిర్మించగా త్రేతాయుగం నుంచి ప్రాచీన పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ ఆలయాన్ని ఆనుకొని కైరన్‌లనే ప్రాచీన సమాధాలున్నాయి. వీటితో పాటు మహబూబాబాద్‌లోని కురవి వీరభద్రస్వామి ఆలయం, అనంతారంలోని శ్రీ వెంకటేశ్వరాలయం, కందగిరిలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, నర్సింహులపేటలోని ఇంద్రకీలాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, జనగామ జిల్లాలోని చిలుపూరుగుట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, ఖిలాషాపూర్‌లోని సర్వాయి పాపన్న కోట, పాలకుర్తిలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, జఫర్‌గడ్ ఖిలా, బచ్చన్నపేట మండలం కొడవటూరులోని సిద్ధేశ్వరాలయం మొదలైన దర్శనీయ ప్రాంతాలున్నాయి.


భద్రకాళి బండ్


మేడారంలోని వనదేవతల గద్దెల ప్రాంగణం

గిరిజన తల్లుల కొలువు.. మేడారం

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే సమ్మక్క సారలమ్మలు కొలువు దీరిన మేడారానికి పర్యాటకుల రాక పెరుగుతోంది. ములుగు జిల్లా కేంద్రానికి 45 కి.మీ. దూరంలో తాడ్వాయి మండల కేంద్రానికి 16కి.మీ. దూరంలో మారుమూల అభయారణ్యంలో ఉన్న ఈ సమ్మక్క సారలమ్మ గద్దెలను రెండేళ్లకోసారి జరిగే జాతర సమయంలో కోటి మందికిపైగా భక్తులు వస్తుండగా.. ప్రస్తుతం సెలవు రోజుల్లో వేలాది మంది దర్శించుకుంటున్నారు. ఇక్కడకొచ్చే పర్యాటకుల కోసం గద్దెలకు సమీపంలోనే పర్యాటక శాఖ హరితహోటల్‌ను నిర్మించింది.

అద్భుత దర్శనీయ ప్రాంతాలు ఉమ్మడి జిల్లా సొంతం

ఉమ్మడి జిల్లాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం ఓరుగల్లు కోట. 12,546 అడుగుల వైశాల్యంతో చుట్టూ ఎత్తైన ఏడు ప్రాకారాలతో 77 బురుజులతో కాకతీయ రాజు రుద్రదేవుడి కాలంలో నిర్మితమైంది. 800 ఏళ్లు అవుతున్నా.. కోట ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ కోటలోని నాలుగు కీర్తితోరణాలు కాకతీయరాజుల ప్రాభవానికి నిలువెత్తు ప్రతీకలుగా దర్శనమిస్తాయి. కోటలో అద్భుతమైన శిల్ప సంపద కనిపిస్తుంది. కోటలోని స్వయం భూ దేవాలయం కాకతీయుల కాలంలో నిర్మించిందే. పర్యాటకుల సందర్శనార్థం కోట మధ్య కాలంలో ప్రతీరోజు కాకతీయుల చరిత్రను తెలియచెప్పే సౌండ్ అండ్ లైట్ షోను ప్రదర్శిస్తున్నారు. కోటలోని గుండు చెరువులో బోటింగ్ సౌకర్యం ఉంది. ములుగు జిల్లా కేంద్రానికి 22 కి.మీ. దూరంలో గోవిందరావుపేట మండలంలోని చల్వాయికి సుమారు 7 కి.మీ.(బుస్సాపూర్) దూరంలో ఉన్న లక్నవరం సరస్సు కూడా చూడదగ్గర ప్రదేశం. వేలాడే వంతెన, సరస్సులో బోటింగ్ ఇక్కడి ప్రత్యేకతలు. ఒక రోజు బస చేయడానికి వీలుగా హరిత హోటల్ ఉంది. ఇదే ములుగు జిల్లా కేంద్రానికి 65 కి.మీ. దూరంలో వాజేడు మండలంలో దట్టమైన అడవి లో పచ్చదనాన్ని అల్లుకొని నీటి హొయలతో హోరెత్తించే బొగత జలపాతం వానాకాలంలో పర్యాటకులను ఆకర్షిస్తోంది. వేసవిలో కళతప్పుతూ.. వానాకాలంలో ఉప్పొంగుతూ.. సహజ అందాలను పంచుతోంది. ఇది సినిమా షూటింగ్‌లు, షార్ట్ ఫిల్మ్‌ల చిత్రీకరణకు అనువైన ప్రాంతం కూడా. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సుమారు 30 కి.మీ. దూరంలో పరకాల-భూపాలపల్లి రోడ్డులో రేగొండ మండలం తిరుమలగిరి శివారులో పాండవుల గుట్టలున్నాయి. పాండవులు దుర్యోధనుడి కంట పడకుండా కొంత కాలం అజ్ఞావవాసం చేశారని చెప్పుకొనే పాండవుల గుట్టలపై క్రీస్తుపూర్వం 8వేల ఏళ్ల నాటి అపురూప రేఖా చిత్రాలు ఉన్నాయి. ఈగుట్టల శ్రేణిలోనే బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయం కూడా ఉంది.


పర్యాటకాభివృద్ధికి ప్రణాళికేదీ?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఇప్పటి వరకు సమగ్రమైన ప్రణాళిక అమల్లోకి రాలేదు. గత ప్రభుత్వం పెద్దగా తీసుకున్న చర్యలు కూడా ఏమీ లేవు. కేంద్ర ప్రభుత్వమే ఎకో, ట్రైబల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు రూ.90కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతోనే గిరిజన, అటవీ ప్రాంతాల్లో ట్రైబల్ టూరిజాన్ని అభివృద్ధి చేశారు. స్మార్ట్ సిటీ నిధులతో వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు, జైన క్షేత్రమైన అగ్గలయ్య గుట్ట, కాజీపేటలోని దర్గా తదితర ప్రదేశాలను అభివృద్ధి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశించినమేర నిధులు ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఏటా ఉమ్మడి వరంగల్‌కు లక్ష మందికిపైగా దేశ, 15వేల మందికిపైగా విదేశీ సందర్శకులు వస్తుంటారు.


రామప్ప ఆలయం


కాకతీయుల కోటలోని కళాతోరణం


లక్నవరం చెరువు


చిల్పూర్ ఆలయం

విద్యాసంస్థల్లో యువ టూరిజం క్లబ్‌లు

పర్యాటకంపై అవగాహనే లక్ష్యంగా నిర్వహణకు ఏర్పాట్లు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 25: సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు, పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. విద్యార్థులకు, యువతకు పర్యాటకంపై అవగాహన కల్పించేందుకు 'యువ టూరిజం క్లబ్‌'లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ క్లబ్‌లు పర్యాటక రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై దృష్టి సారిస్తాయి. ఈ క్లబ్‌లలో 7వ తరగతి నుంచి కళాశాలలో చదివే అంటే 12వ తరగతి విద్యార్థుల వరకు సభ్యులుగా ఉంటారు. ప్రతీ క్లబ్‌కు ఒక విద్యార్థి నాయకుడిగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా నాయకత్వం వహిస్తారు. అన్ని పాఠశాలలు ఆన్‌లైన్ ద్వారా ytc.tourism.gov.in/club.rigistration వెబ్‌సైట్‌లో తమ పాఠశాల యువ టూరిజం క్లబ్ వివరాలజూజీ రిజిస్టర్ చేసుకొని సర్టిఫికెట్ పొందాలి.

యువ టూరిజం క్లబ్‌ల లక్ష్యాలివీ..

దేశంలోని ముఖ్యంగా రాష్ట్రంలోని విభిన్న సంస్కృతులు, భౌగోళిక పరిస్థితుల గురించి విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడం. పర్యాటకం, పర్యావరణం, ప్రకృతి పట్ల స్నేహం, ప్రయాణ మనస్తత్వాన్ని నేటి యువతలో పెంపొందిస్తాయి. యువత మరియు రాబోయే తరానికి పర్యాటక ప్రాముఖ్యతను వివరిస్తూ దేశంలోని అనేక కళలు, సాంస్కృతిక రూపాల ప్రశంసలకు దోహదపడే విభిన్న కార్యకలాపాలను చేపడతాయి. అలాగే పర్యాటకం, తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాయి. విద్యార్థులతో తమ ప్రాంత పర్యాటకాన్ని ప్రచారం చేయించడాన్ని కూడా ఈ క్లబ్‌ల బాధ్యతగా తీసుకుంటాయి.

పర్యాటకంపై అవగాహన కల్పించడమే లక్ష్యం

కె.రాము, డీఈవో, జనగామ



ప్రభుత్వ విద్యనభ్యసించే విద్యార్థులకు పర్యాటకంపై అవగాహన కల్పించే లక్ష్యంతో యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం సమాయత్తమైంది. 7వ తరగతి నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు ఈ క్లబ్‌లో సభ్యులుగా ఉంటారు. బాలురు, బాలికల ప్రాతినిధ్యం సమానంగా ఉండాలి. దీనికి ఒక ఉపాధ్యాయుడు ఇన్‌చార్జ్‌గా ఉంటాడు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా క్లబ్‌లను ఏర్పాటు చేస్తారు.

కోకరిక్యులర్ యాక్టివిటీగా క్లబ్‌ల నిర్వహణ

బొమ్మనబోయిన శ్రీనివాస్, జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి, జనగామ



ప్రభుత్వం విద్యార్థులకు కోకరిక్యులర్ యాక్టివిటీగా క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. ఇవి విద్యార్థుల్లో ఉత్సుకత, సాహసోపేత, సృజనాత్మకత, ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తాయి. ఫీల్డ్ ట్రిప్స్, విజ్ఞాన విహార యాత్ర, శాస్త్ర సాంకేతిక ఉన్నత విద్యా సంస్థల, చారిత్రక కట్టడాల సందర్శనలో ఈ క్లబ్‌లు తోటి విద్యార్థులకు మార్గదర్శనం చేస్తాయి.

క్లబ్‌ల అభివృద్ధికి సమర్థవంతంగా కృషి

బి.వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి, జనగామ



ప్రభుత్వం విద్యార్థులకు పర్యాటక రంగంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ క్లబ్‌ల అభివృద్ధికి కృషి చేస్తాం. విద్యార్థులకు, యువతకు సంస్కృతి, సంప్రదాయాలు, దేశంలోని విభిన్న సంస్కృతిపై అవగాహన కల్పిస్తూ కింది తరం వారికి ఈ క్లబ్‌ల ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని కల్పించనున్నారు.

మిల్లర్ల దొంగాట!

(5వ పేజీ తరువాయి)

సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్నట్లుగా సమాచారం. మూడు సీజన్‌లకు సంబంధించి సుమారు 3లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉండటంతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

అధికారుల దాడులతో అక్రమాలు వెలుగులోకి..

ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారుల బృందాలు వేర్వేరుగా సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై దాడులు నిర్వహిస్తున్నారు. దీంతో మిల్లుల్లో అక్రమంగా సీఎంఆర్ అమ్ముకోవటంతో పాటు రీసైక్లింగ్ దందా వెలుగులోకి వస్తోంది. ఇటీవల ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో నారాయణ అగ్రో ఇండస్ట్రీస్ 2022-23 రబీలో 4,298.200 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 2,922.776 టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా, 1,345.535టన్నులు అప్పగించారు. మిగిలిన 1,577.246టన్నులను ప్రభుత్వానికి అప్పగించలేదు. ఈ మొత్తం బియ్యం 57,987బస్తాల్లో నిల్వ ఉండాలి, కానీ, మిల్లులో కేవలం 7,224 బస్తాలే ఉన్నాయి. మిగతా 50,763బస్తాల్లో రూ.7,12,40,546ల విలువైన బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా, బయట మార్కెట్‌లో అక్రమంగా అమ్ముకున్నట్లుగా సివిల్ సప్లయిస్ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. అలాగే మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచర్ల గ్రామంలో శ్రీనవ్య రైస్‌మిల్లుపై గత శనివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 2022-23కు సంబంధించిన 53,560 క్వింటాళ్ల వడ్లు మరాడించి 36,420క్వింటాళ్ల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంది. అయితే 8,871క్వింటాల్ మాత్రమే సీఎంఆర్ అప్పగించారు. వేరే చోట కొంత ధాన్యం చూపించినా ఇంకా రూ.8.37కోట్ల విలువైన 34,273 క్వింటాళ్ల ధాన్యం లేకపోవడంతో విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. ఇలా ఇటీవల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి, మిల్లర్ల అక్రమాలను ప్రభుత్వం వెలుగులోకి తీసుకవస్తుంది. దీంతో ఇన్నాళ్లు సీఎంఆర్ ఇవ్వకుండా దొంగాటాడిన మిల్లర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇటీవల పలు మిల్లుల్లో జరిగిన దాడులు ఇలా..

- మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటలోని లక్ష్మీపారా బాయిల్డ్ రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.6.49కోట్ల విలువైన ధాన్యం మరాడించి అమ్ముకున్నట్లుగా గుర్తించి కేసులు నమోదు చేశారు.
- హనుమకొండ జిల్లా ఎలకతుర్తి మండలం పెంచికలపేట గ్రామశివారులోని బాలాజీ పారాబయిల్డ్ ఇండస్ట్రీస్‌లో రూ.7.50కోట్ల విలువైన ధాన్యాన్ని మాయం చేసినట్లు గుర్తించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మిల్లు యాజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.
- వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో లక్ష్మీగణపతి ఇండస్ట్రీస్‌లో రూ.15.36కోట్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించటంతో యాజమానిపై కేసు నమోదు చేశారు.
- జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మచ్‌పహడ్ గ్రామంలోని శ్రీసాయిరాం బిన్నీ రైస్ మిల్లులో రూ.5.67కోట్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు.

తీరు మార్చుకోని నకిలీ వైద్యులు

టీజీఎంసీ అధికారుల తనిఖీలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 26: తెలంగాణ వైద్య మండలి అధికారులు, వరంగల్ యాంటీక్వాకరీ బృందం సభ్యులు వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నా పలువురు నకిలీ వైద్యులు తీరు మార్చుకోవడం లేదు. ఐఎంఏ, హెచ్‌ఆర్‌డీఏ జిల్లా సభ్యులు డాక్టర్ వి.నరేశ్ కుమార్, డాక్టర్ వద్దిరాజు రాకేశ్, డాక్టర్ అన్వర్‌మియా, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ అజిత్‌పాషాలు హనుమకొండలోని భీమారం, దీన్‌దయాల్‌నగర్ కాలనీ, వరంగల్‌లోని రామన్నపేట ప్రాంతాల్లో నకిలీ వైద్యులు ఆర్‌ఎంపీ, పీఎంఆపీ సెంటర్లపై గురువారం తనిఖీలు నిర్వహించారు. భీమారంలోని ఇందిరాగాంధీ విగ్రహం వెనుకాల శ్రీకళ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు నకిలీ వైద్యుడు గొర్రె నరేశ్, రాజ్ హోటల్ దగ్గర దీన్‌దయాల్‌నగర్ అభిరామ్ క్లినిక్ నిర్వాహకుడు నకిలీ వైద్యుడు ఈసంపల్లి మహేందర్, జనరల్ నర్సింగ్ చదివి వైద్యుడి వలె క్లినిక్ బోర్డు ఏర్పాటు చేసి అధిక మొతాదులో ఎలాంటి శాస్త్రీయత లేకుండా యాంటీబయాటిక్, స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు టీజీఎంసీ అధికారులు గుర్తించారు. రామన్నపేటలోని నకిలీ వైద్యుడు ఆర్‌ఎంపీ బి.జ్ఞానేశ్వర్, ఏఎన్‌ఎం చదివి డాక్టర్‌గా స్టెరాయిడ్స్, నొప్పి నివారణ ఇంజక్షన్లు, యాంటీబయోటిక్ ఇంజక్షన్లు, సెలైన్ బాటిల్స్ ఇస్తున్నట్లు గుర్తించి ఆధారాలను కౌన్సిల్‌కు పంపించారు. ఈ ముగ్గురు నకిలీవైద్యులపై ఎన్‌ఎంసీ 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు టీజీఎంసీ అధికారి, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్‌కుమార్ తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ కొరడా

రూ.8లక్షల సామగ్రి స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 26: కాలం చెల్లిన బేకరి ఉత్పత్తులపై టాస్క్‌ఫోర్స్ కొరడా ఝుళిపించింది. ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వరంగల్‌లో సంతోష్‌కుమార్ నకిలీ బేకరి ఉత్పత్తులు విక్రయిస్తున్నారనే సమాచారంతో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రూ.8లక్షల విలువైన 196 రకాల నకిలీ బేకరి ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సంతోష్‌కుమార్‌ను విచారణ నిమిత్తం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ తెలిపారు.

డిగ్రీ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 26: కేయూ పరిధిలో డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, బ్లాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును అక్టోబరు 5 వరకు పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో అక్టోబరు 15 వరకు గడువు పొడిగించినట్లు వివరించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్ http://www.kuonline.co.in లో చూడాలని పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 26: మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో పెయింట్‌షాపులో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. రూ.30వేల నగదు స్వాధీనం చేసుకుని పేకాట అడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం ఆరుగురిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్. రవికుమార్ ధ్రువీకరించారు.

ఒకే ఘటనలో రెండు కేసులు నమోదు

- విధులకు ఆటంకం.. విచారణలో బెదిరింపులు
- నిందితుడి అరెస్టు, కోర్టులో రిమాండ్

బయ్యారం, సెప్టెంబరు 26 : విధులకు ఆటంకం కల్పించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్న క్రమంలో ఆత్మహత్యాయత్నంతో బెదిరింపులకు పాల్పడిన నిందితుడిపై మరోకేసు నమోదు చేసి.. గురువారం అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ పరిచినట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కస్తూరినగరం గ్రామంలో గతనెల 13న ఓ ఏఎన్‌ఎం విధులు నిర్వర్తిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన ధరావత్ మోహన్ ఏఎన్‌ఎం విధులను ఆటంక పర్చడంతో పాటు దూషించి, అవమాన పరిచాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐపీసీ సెక్షన్ 132/బీఎన్‌ఎస్ ప్రకారం తొలుత కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా తాను సిబ్బందితో కలిసి కస్తూరినగరం గ్రామానికి విచారణకు వెళ్లగా, మీరు విచారణకు ఎందుకు వచ్చారంటూ నిందితుడు విచారణకు అడ్డుతగులటంతో పాటు ఆత్మహత్యాయత్నాంతో బెదిరింపులకు పాల్పడగా నూతన చట్టం ప్రకారం ఐసీఈ సెక్షన్ 132/ బీఎన్‌ఎస్, 226/ బీఎన్‌ఎస్ కింద మరో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేసులలో నిందితుడైన మోహన్‌ను గురువారం ఆరెస్టు చేసి, కోర్టులో రిమాండ్ పరిచినట్లు ఎస్సై తెలిపారు. కాగా, నూతన చట్టం ప్రకారం విధులకు ఆటంకం కల్పించడం, విచారణలో బెదిరింపులకు పాల్పడటంపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యశ్వంతాపూర్ విషాదానికి 70 ఏళ్లు

- నాటి రైలు ప్రమాదంలో 300 మంది జలసమాధి
- శవాల గుట్టలతో తల్లడిల్లిన పల్లెలు
- కలత చెందిన నాటి రైల్వేశాఖ మంత్రి లాల్ బహదూర్‌శాస్త్రి
- నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా

లింగాలఘణపురం/జనగామ కల్చరల్, సెప్టెంబరు 26: బ్రిటీష్ పాలనను అంతమొందించి స్వతంత్ర స్వేచ్ఛావాయువులను పీల్చుకుంటున్న తరుణమది.. అప్పటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడేళ్లు మాత్రమే అయ్యింది. సరికొత్త రాజ్యాంగం రూపుదిద్దుకున్న నాలుగేళ్లకు.. అప్పుడప్పుడే పాలన గాడినపడుతున్న వేళ.. ఓ నిశిరాత్రి జరిగిన పెనుప్రమాదం యావత్ దేశాన్ని కుదిపేసింది. అంతేకాదు.. ఓ కేంద్ర మంత్రి కలతకు కూడా కారణమైంది. అదే 300 మంది ప్రయాణికులను పొట్టనబెట్టుకున్న యశ్వంతాపూర్ రైలు ప్రమాదం. ఈ ప్రమాదం జరిగి శుక్రవారానికి 70 ఏళ్లు పూర్తవుతోంది.

ఏడు దశాబ్దాల కన్నీటి చరిత్ర..

1954 సెప్టెంబరు 27న సోమవారం రాత్రి 7 గంటలకు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి జీటీ- గ్రాండ్ టాంక్(నిజాముద్దీన్) ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. అప్పటికే భారీ వర్షం పడి.. యశ్వంతాపూర్ వద్ద వాగు ఉప్పొంగుతోంది. ఈ క్రమంలోనే ఆ రైలు జనగామ రైల్వేస్టేషన్ దాటి.. 5నిమిషాల వ్యవధిలో రాత్రి 11:15గంటలకు యశ్వంతాపూర్ వాగుపైనున్న రైల్వేబ్రిడ్జిని దాటుతోంది. కానీ వాగు మరింత ఉగ్రరూపం దాల్చడంతో రైలు ఇంజన్, ఆ వెనుక రెండు బోగీలు రైల్వేబ్రిడ్జిని దాటి ముందుకు వెళ్లగా.. ఒక్కసారి బ్రిడ్జికూలిపోయింది. దీంతో వెనుక ఉన్న నాలుగు బోగీల లింకు ఊడిపోయి అమాంతం వరదప్రవాహంలో పడటంతో ఆ బోగీల్లో ప్రయాణిస్తున్న సుమారు 300మంది ప్రవాహంలో కొట్టుకుపోయారు. అప్పటికే గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందో తెలుసుకునే ప్రాణాలు నీటిలో కలిసిపోయాయి. అయితే ప్రమాదం జరిగిన రెండు రోజుల దాకా మృతదేహాలు లభ్యం కాలేదు. చివరకు ఘటనా స్థలం నుంచి లింగాలఘణపురం మండలం నెల్లుట్ల, పటేల్‌గూడెం, నవాబుపేట, వడ్డిచర్ల, దేవరుప్పుల మండలం చిన్నమడూరు గ్రామాల మీదుగా కొట్టుకుపోయి 15కిలోమీటర్ల దూరంలో లభ్యమయ్యాయి. అలా లభ్యమైన వందలమంది మృతదేహాలను నాలుగు చోట్లకు చేర్చారు. నాడు ఆ శవాలగుట్టలను చూసి స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. అంతేకాదు వాగు పరిసర గ్రామాల మృతదేహాలు కుళ్లిన వాసనను తట్టుకోలేకపోయారని చెబుతుంటారు. ఈ ఘటనను జనగామ ప్రాంత ప్రజలు ఇప్పటికీ మూఢవిశ్వాసాలతో జోడించి చర్చించుకుంటారు. అంతేకాకుండా చాలామంది కళాకారులు పల్లెసుద్దులు, వీధినాటకాలు, భాగవతాలు, ఒగ్గుకథల రూపంలో దుర్ఘటనను కళ్లకు కట్టినట్లుగా వివరించడం విశేషం.


నాడు కూలిన వంతెన స్థానంలో నిర్మాణమైన వంతెన

ప్రయాణికుల ఆర్తనాదాలతో ఉలిక్కిపడిన పల్లెలు

గ్రాండ్‌టాంక్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురవడంతో ప్రయాణికులు చేసిన హాహాకారాలతో సమీప గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. గాఢ నిద్రలో ఉన్న నెల్లుట్ల, యశ్వంతాపూర్, జనగామ ప్రజలను వారి ఆర్తనాదాలు ఉలిక్కిపడి లేచేలా చేశాయి. భారీ వర్షంలో ధైర్యం చేసి అటుగా వెళ్లి ప్రయత్నించిన కొద్దిమంది జరిగిన ఘటనను చూసి చలించిపోయారు. తమ వాళ్లను కాపాడాలని ఆర్తనాదాలు చేస్తున్న తీరుతో కన్నీటిపర్యంతమయ్యారు. అప్రమత్తమై ఆదుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆ పరిస్థితుల్లో ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

నైతిక బాధ్యత వహించిన రైల్వేశాఖ మంత్రి

యశ్వంతాపూర్ ప్రమాద ఘటనలో 300మంది ప్రయాణికులు జలసమాధి కావడంతో అప్పటి రైల్వేశాఖ మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి తీవ్రంగా కలత చెందారు. తన శాఖలో జరిగిన వైఫల్యం కావడంతో నైతిక బాధ్యత వహిస్తూ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇది నాటి దేశ రాజకీయాల్లో సంచలనమైంది.

శవాలపై ఆభరణాల చోరీ..

రైలు ప్రమాదం జరిగిన తర్వాత మృతదేహాలను వెలికితీసేందుకు ఓ వైపుసహాయక చర్యలు జరుగుతుండగానే మరోవైపు కొందరు మానవత్వాన్ని మరిచి మృతదేహాలపై ఉన్న బంగారు ఆభరణాలను, బ్యాగుల్లోని డబ్బులు, సామగ్రిని దోచుకున్నట్లు స్థానికులు ఇప్పటికీ చెబుతుంటారు. దుండగులు శవాలపై ఎగబడి మరీ కిలోల కొద్దీ బంగారు, వెండి ఆభరణాలు, బంగారు నాణేలు, రూ.లక్షల నగదును దోచుకు దోచుకున్న వారిలో నేడు ఆర్థికంగా నిలదొక్కుకున్న కుటుంబాలు ఇప్పటికీ ఉన్నాయని చర్చించుకుంటూ ఉంటారు.

ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం

- ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కవు
- అవినీతి అక్రమాలకు మారుపేరు బీఆర్‌ఎస్
- కేసీఆర్ కుటుంబం దోపిడీకి తెగబడింది
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 26: ఇప్పట్లో ఉప ఎన్నికలు రావని, ఒకవేళ వచ్చినా తాము ఎదుర్కోవడా నికి సిద్ధంగా ఉన్నామని, ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలం గా ఉన్నారని జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొ న్నారు. గురువారం స్టేషన్ ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప లు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ తాటాకుచప్పు ళ్లకు బెదిరేది లేదని, అసలు ఉప ఎన్నికలంటూ వస్తే ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా రావని, ముఖ్యంగా తమ పార్టీకి డిపాజిట్ వస్తుందో రాదో బీఆర్‌ఎస్ వాళ్లే ఆలోచించుకోవాలన్నారు. తన మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఇలాంటివెన్నో ఎదుర్కొన్నానని, తన ఎదుట ఎగిరెగిరి పడిన వారెందరో కనుమరుగయ్యారన్నారు.

ప్రజాస్వామ్యం పట్ల, కోర్టులు, ఎన్నికల వ్యవస్థల పట్ల తనకు గౌరవం ఉందని, ఏ పరిస్థితి వచ్చిన ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలి పారు. సిగ్గు లేకుండా బీఆర్‌ఎస్ నా యకులు ఫిరాయింపులపైన మాట్లాడుతున్నారని, పదేళ్ల కాలంలో 38 మంది ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నది వాళ్లు అని, చివరకు రాజకీయ పార్టీల శాసనసభ పక్షాలను సైతం విలీనం చేసుకున్నది వారు కాదా అని ప్రశ్నించారు. అప్పుడు వారికి ప్రజాస్వామ్యం, నైతిక విలువలు, ఫిరాయింపుల చట్టం గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అవినీతి అక్రమాలకు మారు పేరని, ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయవద్దు, జిల్లాకు ఉన్న చరిత్రను నాశనం చేయవద్దు అని మొత్తుకున్నా కేసీఆర్ వినలేదని, ఈ విషయమై తాను ఎదురు తిరిగినందున రెండోసారి తనకు మంత్రిపదవి ఇవ్వలేదని ఆరోపించిన ఆయన ఈ విషయంలో తాను బాధ పడలేదన్నారు. ఎలాంటి కారణాలు లేకుండానే జిల్లాను ఆరు ముక్కలు చేశారన్నారు.

వరంగల్ జిల్లా గొప్పదనం, చరిత్రను నాశనం చేయడానికే కేసీఆర్ ఆరు ముక్కలు చేశారన్నారు. కేసీఆర్ కుటుంబం ప్రజాస్వా మ్యవాదుల నోళ్లు నొక్కి ఇష్టారీతిన దోపిడీ చేశారని, మొత్తం కుటుంబం దోపిడీకి తెగబడిందని, కుటుం బం చేతిలో తెలంగాణ బందీగా మారిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో వేల ఎకరాల భూములు, కోట్ల విలువైన భవనాలు కేసీఆర్ కుటుంబానికి ఎక్కడి నుంచి వచ్చాయో తెలంగాణ ప్రజలకు తెలపా ల్సిన అవసరం ఉందన్నారు. తొమ్మిది నెలలు పూర్తి కాని కాంగ్రెస్ ప్రభుత్వం పైన చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయని విధంగా సీఎం రేవంత్ రెడ్డి 23 లక్షల మంది రైతులకు రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు బెలిదె వెంకన్న, జగదీష్‌చందర్ రెడ్డి, శిరీష్ రెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి WARANGAL CITY
8
వరంగల్ సిటీ
• వరంగల్ • ఖిలావరంగల్
శుక్రవారం 27 సెప్టెంబరు 2024



చేతి వృత్తులకు ప్రోత్సాహం

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 26: చేతి వృత్తుల ప్రోత్సాహంలో జిల్లాకు మొదటి స్థానం దక్కేలా కృషి చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పీఎం విశ్వకర్మ పథకం అమలు తీరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత చేతి వృత్తుల ప్రోత్సాహం కింద పీఎం విశ్వకర్మ పథకానికి వడ్రంగి, కమ్మరి, కౌసలి, మోచీలు, తాళాలు మరమ్మతు చేసేవారు, బిట కమ్మరి, ఔసలి కమ్మరి, మేదరి, ఉప్పరి, ఎరుకలి బొమ్మలు చేసేవారు, చాకలి, మంగలి, పూలు అల్లేవారు, దర్జి, బెస్త తదితర వృత్తుల వారు అర్హులని తెలిపారు.

ఈ పథకం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వర్తింస్తుందన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, బీసీ వెల్ఫేర్ అధికారి లలితారెడ్డి, ఎల్‌డీఎం రాజు, మెప్మా పీడీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 26: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వరంగల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగనున్నట్లు చైర్మన్ ఇట్యాల హరికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరెపల్లిలోని ఎరువుల గోదాం వద్ద ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని వెల్లడించారు. సంఘం పరిధిలోని పైడిపెల్లి, ఆరెపల్లి, కొత్తపేట, దేశాయిపేట, ఏనుమాముల, మట్వాడ గ్రామాల రైతులు, సంఘం సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పెరిగిన ధరలతో పేదలపై భారం

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 26: పెరిగిన నిత్యావసరాల వస్తువుల ధరలతో నిరుపేదలపై పెనుభారం పడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. పెరిగిన ధరలను నిరసిస్తూ గురువారం వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో సీపీఐ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌కె.బాష్మియ, గుండె భద్రి, గన్నారపు రమేష్, జన్ను రవి, పరికిరాల రమేష్, దస్రు, ఖాసీం, అశోక్, ఆరె రాజు తదితరులు పాల్గొన్నారు.

20 మంది వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 26: మద్యం దాగి వాహనాలు నడిపిన కేసులో 20 మందికి గురువారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 20 మందికి రూ.39,800 జరిమానా విధించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన నలుగురికి రూ.7800 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పిల్లలను జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి



పోషణ మాసోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ చందన

శంభునిపేట, సెప్టెంబరు 25: పిల్లలను జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అన్నారు. నగరంలోని రంగశాయిపేట ఆదర్శ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని దంపతులచే వంట, ఆహార ప్రదర్శన, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ చందన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి హాజరై మాట్లాడారు. పిల్లలకు ప్రొటీన్లు, కార్బొహైడ్రేడ్‌లు కలిగిన ఆహారాన్ని ఇంట్లోనే తయారుచేసి అందించాలని అన్నారు. పిల్లలు, గర్భిణులు అంగన్‌వాడీల్లో అందించే గుడ్లు, ఆహారం, పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్ సమయపాలన పాటించాలన్నారు. అనంతరం పోషక ఆహార ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనిత, జ్యోతి, రాణి, వినీత, నజీమ, యశోద, ఏఎన్ఎం శారద, ఆయాలు యమున, మమత, స్వరూప, రాజ్యలక్ష్మి, ఆశాలు, అంగన్‌వాడీ పర్యవేక్షణ కమిటీ సభ్యులు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



27వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్, నేతలు



బట్టల బజార్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



మామునూరు పోలీసు క్యాంపులో నివాళులర్పిస్తున్న కమాండెంట్, అధికారులు

చాకలి ఐలమ్మ పోరాటం చిరస్మరణీయం

టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ రామ్‌ప్రకాశ్

నగరంలో ఘనంగా జయంతి కార్యక్రమాలు

శంభునిపేట, సెప్టెంబరు 26: భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం రజాకారులను, భూస్వాములను ఎదురించిన వీరవనిత ఐలమ్మ పోరాటం చిరస్మరణీయమని టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ బి.రామ్‌ప్రకాశ్ అన్నారు. మామునూరులోని బెటాలియన్‌లో గురువారం చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్‌ఐలు శోభన్, వెంకటేశ్వర్లు, పురుషోత్తంరెడ్డి, రవి, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మామునూరు పీటీసీలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపల్ ఇంజారపు పూజ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, 1200 మంది శిక్షణ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగశాయిపేట జంక్షన్‌లో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, ఖిలావరంగల్ పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్ పాల్గొని కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు మంతెని సునిత, ఎలుగు సాంబేశం, ముత్తినేని రామ్మూర్తి, ఆవునూరి కుమార్, సయ్యద్ బషీర్, దామెరకొండ కర్ణాకర్, కర్ర కుమార్, కేడల మల్లేశం, బత్తిని భద్రయ్య పాల్గొన్నారు. 41వ డివిజన్ శంభునిపేట జంక్షన్‌లో కార్పొరేటర్ పోశాల పద్మస్వామి ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని నిర్వహించారు. కలకోట్ల రమేష్, ఈదుల భిక్షపతి, అన్వేష్, మాచర్ల సాంబయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు. 43వ డివిజన్ తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఆర్టీఏ జంక్షన్‌లోఐలమ్మ జయంతిని నిర్వహించి నివాళులర్పించారు. ఉద్యమకారులు భూంపల్లి జయశంకర్, యాడాల జగపతి, జోరిక సదానందం, కలకోట్ల క్రాంతి, అంబాల ఉదయ్‌కిరణ్, వస్కుల ప్రసాద్, యాడాల రమ్యశ్రీ, ఇల్లందుల రవి, మైదం వీరస్వామి, భిక్షపతి, కృష్ణ పాల్గొన్నారు.

● గిర్మాజిపేట: నగరంలోని 27వ డివిజన్ బొడ్రాయి, జిట్టేడ్ హనుమాన్ దేవాలయం ప్రాంతాలలో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, గిర్మాజిపేట రజక సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగిన వేడుకల్లో ఐలమ్మ చిత్రపటానికి కార్పొరేటర్ అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, ఎండి.అయుబ్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో నాయకులు కొత్తకొండ శ్రీనివాస్, కొత్తకొండ రవి, ఐలోని శంకర్, సుధాకర్, కాంగ్రెస్ నాయకులు అన్వేష్, అమర్, శారద తదితరులు పాల్గొన్నారు. 26వ డివిజన్‌లో స్వర్ణోదయ రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని నిర్వహించారు. కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, కాంగ్రెస్ నాయకులు బస్వరాజు శ్రీమాన్ తదితరులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ఆటోనగర్: 23వ డివిజన్ కొత్తవాడలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామెర రాజ్‌కమల్ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని నిర్వహించారు. స్థానికులకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి-సత్యనారాయణ, కాంటెస్టెడ్ కార్పొరేటర్ చిప్ప వెంకటేశ్వర్లు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు గొండ రజిత-శ్రీనివాస్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు, సామల రమేష్, పెద్దారపు కుమారస్వామి, సతీష్, అమ్జద్, రావుల రాజీవ్‌గాంధీ, భాస్కరాచారి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కరీమాబాద్: 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోటలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ పల్లం పద్మరవి పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణు, నాగపూరి సంజయ్‌బాబు, వాణి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ సామల సుధాకర్, నాయకులు బత్తిని రంజిత్, కస్తూరి వంశీ, బండి భాస్కర్, అనిల్, శ్రీనివాస్, నరిగె శ్రీను, శోభన్, రాజు, సతీష్, యాదగిరి, బ్రహ్మం, రమేష్, ఉపేందర్, శివ, మధు, మొగిళి, విన్ను, రాజమణి, పద్మ, స్వప్న, రజిత పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: 34వ డివిజన్ శివనగర్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి కాంగ్రెస్ నగర నాయకుడు పగడాల సతీష్, కన్నోజు లావణ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ముందుగా రజక వృద్ధురాలిని శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు మంద అక్షిత్, అబ్బోజు తిరుపతి, సారా సాంబయ్య, శెట్టి అరుణ, మంతెన సంధ్య, గజ్జి విజయ, సోమలక్ష్మి, వడ్డెపల్లి భాగ్యలక్ష్మి, అనుముల స్వప్న, కొక్కు జయ, తోట నాగరాణి, శెట్టి రాజేష్, నాగరాజు పాల్గొన్నారు.

37వ డివిజన్ తూర్పుకోటలో డివిజన్ అధ్యక్షుడు బోయిన దూడయ్య ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి కార్పొ రేటర్ వెల్పుగొండ సువర్ణసురేష్ పూలమాల వేసి నివాళులర్పించి పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు బెడిద వీరన్న, సంగరబోయిన చందర్, బొలుగొడ్డు శ్రీనివాస్, అల్లం కేశవరాజు, బంగారి శ్రీనివాస్, లత, మంజుల, కుమార్, సారంగపాణి, భిక్షపతి, వంశీ, రాజు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు బాషుమియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, ఎమ్డీ.అక్బర్, జన్ను రవి, రమేష్, వెంకటాద్రి, యాకోబు పాల్గొన్నారు. 35వ డివిజన్‌లో కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి పండ్లు పంపిణీ చేశారు. 37వ డివిజన్ కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు రేణికుంట్ల శివ, శ్రీరాం రాజేష్, గడ్డం సుధాకర్, రజక సంఘం నాయకులు నాగరి మొగిళి, కొత్తపెల్లి రవి, ఎమ్డీ. అఫ్జల్, సతీష్, సంగి షారూక్, సందీప్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● మట్టెవాడ: భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పననవీన్ అన్నారు. 28వ డివిజన్ బీజేపీ రజక సెల్ కన్వీనర్ కొత్తపల్లి రాజేష్ ఆధ్వర్యంలో బట్టల బజార్‌లో ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, డివిజన్ అధ్యక్షులు రామని సుమన్, రఫీ, కట్ల ఈశ్వరప్రసాద్, చందు, శ్రీకాంత్, సదాశివుడు, రమేశ్, గణేష్, లక్ష్మణ్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.



రంగశాయిపేటలో వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్, పీఏసీఎస్ చైర్మన్ పద్మజనార్దన్



తూర్పుకోటలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణసురేష్



ఎస్ఆర్ఆర్ తోటలో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పల్లం పద్మరవి

సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

కమిషనర్, మేయర్‌ను కలిసిన ఉత్సవ కమిటీ సభ్యులు

కరీమాబాద్, సెప్టెంబరు 25: నగరంలోని ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో ప్రతి ఏటా మాదిరిగానే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, ఈ ఉత్సవాలకు జీడబ్ల్యూఎంసీ తరపున ఏర్పాట్లు చేయాలని దసరా ఉత్సవ కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు ఆధ్వర్యంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు ప్రజాదరణ పొందిన వేడుకలని, వందేళ్లుగా నిర్వహిస్తున్న ఈ వేడుకలకు తగిన ఏర్పాట్లు చేసి సహకరిస్తామని తెలిపారు. మేయర్, కమిషనర్‌లను కలిసిన వారిలో దసరా ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్నగౌడ్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, సహాయ కోశాధికారి వెలిదె శివమూర్తి, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, నాగపూరి రంజిత్‌గౌడ్, పొగాకు సందీప్, దామెరకొండ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలు బజ్జూరి వాసు, పూదరి అజయ్, బత్తిని అఖిల్‌గౌడ్, నాగపూరి అశోక్, నాగపూరి మహేష్, నరిగె శ్రీను, బిట్ల క్రాంతి, నాగపూరి నాగరాజు, పూజారి విజయ్, పార్వతి కృష్ణంరాజు, మీరిపెల్లి వినయ్, మోడెం రాజశేఖర్, బత్తిని చరణ్, యెలగందుల కృష్ణమూర్తి, గట్టు బాలసాయి, జయమహేష్ తదితరులు పాలొన్నారు.



మేయర్ సుధారాణికి వినతి పత్రాన్ని అందజేస్తున్న దసరా ఉత్సవ కమిటీ సభ్యులు

ధర్నాను విజయవంతం చేయాలి

గిర్మాజిపేట, సెప్టెంబరు 26: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 30న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) ధర్నాకు వరంగల్‌జిల్లా నుంచి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఐఎఫ్‌టీయూ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో ధర్నా పోస్టర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, న్యూడెమోక్రసీ నాయకుడు బాలరాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఇనుముల కృష్ణ, ఎండి.అక్బర్, పుప్పాల రాజేందర్, హరిబాబు, అశోక్, రంజిత్, రాజేందర్, రాజేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకులు దయాకర్, బాలరాజుమాట్లాడుతూ మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలతో ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేటీకరణ అవుతున్నాయని ఆరోపించారు.

శివనగర్ బతుకమ్మ వేడుకల కమిటీ ఏర్పాటు

సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు మైదానాన్ని పరిశీలించిన సభ్యులు



శివనగర్‌లో మైదానాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

ఖిలావరంగల్, సెప్టెంబరు 26: నగరంలోని శివనగర్‌లో సద్దుల బతుకమ్మ, దసరా మైదానాన్ని బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపెల్లి శ్రీనివాస్, మెరుగు అశోక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా మంచి వాతావరణంలో జరుపుకోవాలన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవ కమిటీ అలాగే ఉపాధ్యక్షులుగా రేణికుంట్ల శివ, అనుముల నగేష్, తుంగ నర్సింగం, సందెల రాంబాబు, సహాయ కార్యదర్శులుగా తోట శ్రీనివాస్, కానుగంటి స్వామి, జన్ను రాజు, జన్ను సునీల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా గడ్డం రవి, లీగల్ అడ్వైజర్‌గా శామంతుల శ్రీనివాస్, సలహాదారులుగా మర్రి శ్రీనివాస్, గంట రవికుమార్, కరాటే ప్రభాకర్, చింతం ప్రవీణ్, గజ్జెల లింగమూర్తి, శ్రీరాం రాజేష్, సింగిరెడ్డి యశోద, ఉమ, అస్మిత, విజయరాంచందర్, రాధిక ఎన్నికయ్యారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపునేనికి పరామర్శ



మాజీ ఎమ్మెల్యేను పరామర్శిస్తున్న బొల్లం సంపత్

మట్టెవాడ, సెప్టెంబరు 26: మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సోదరుడు రవికుమార్ ఇటీవల మృతి చెందాడు. వరంగల్ శివనగర్‌లోని నరేందర్ నివాసానికి గురువారం తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్ చేరుకొని పరామర్శించారు. కార్యక్రమంలో పెంచాల గోపన్న, కుసుమ అశోక్, కొత్తగట్టు సుధాకర్, కేడల పవన్, అల్లెపు వెంకటస్వామి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 26: ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌జోషి అన్నారు. నగరంలోని దేశాయిపేట కూడలిలో గురువారం స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సీకేఎం కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి చేపట్టిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ సురేష్‌జోషి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రోడ్లకిరువైపులా పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజేష్, మునిసిపల్ సూపర్‌వైజర్లు నరేందర్ భాస్కర్, మునిసిపల్ ఎస్‌ఐలు ధరమ్‌సింగ్, వెంకన్న, సంపత్, స్వచ్ఛతా హీ సేవా ఇన్‌చార్జ్ గౌతమి పవన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం

▸▸ ఆగివున్న లారీని ఢీకొట్టిన మరో లారీ

▸▸ ఇద్దరి మృతి.. మృతుల్లో ఒకరు వరంగల్ వాసి



క్లీనర్ యాదగిరి మృతదేహం

బంగారుపాళ్యం(చిత్తూరు), సెప్టెంబరు 26: ఏపీలోని చిత్తూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వరంగల్‌కు చెందిన ఓ లారీ క్లీనర్ మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం సమీపంలోని మొగిలి ఘాట్‌లో ఈ ప్రమాదం జరిగింది. వి.కోట నుంచి కట్టెల లోడుతో భద్రాచలం వెళుతున్న ఓ లారీ బుధవారం మధ్యాహ్నం మొగిలి ఘాట్ వద్ద మరమ్మతులకు గురైంది. దీంతో లారీని రోడ్డు పక్కనే ఆపి డ్రైవర్, క్లీనర్ విశ్రాంతి తీసుకున్నారు. అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో బెంగళూరు నుంచి పంచదార లోడుతో వెళుతున్న మరో లారీ అదుపుతప్పి ఆగివున్న లారీని ఢీకొంది. దీంతో ఆగివున్న లారీ డీజల్ ట్యాంకు పగిలి మంటలు చెలరేగి దగ్ధమైంది. డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు, చిత్తూరు, పలమనేరు అగ్నిమాపక సిబ్బందికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఎక్స్‌కవేటర్ సాయంతో లారీలో వున్న కట్టెలను తొలగించారు. కాలిన లారీ కింద ఆ లారీ డ్రైవర్ జామిశెట్టి రామరాజ్(50) పూర్తిగా కాలిపోగా, క్లీనర్ గాయపడ్డాడు. చక్కెరలోడు లారీలోని క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన డ్రైవర్ సాయికృష్ణ, వరంగల్‌కు చెందిన క్లీనర్ యాదగిరి(50)లను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీయగా క్లీనర్ యాదగిరి అప్పటికే మృతి చెందాడు. గాయపడిన సాయికృష్ణను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీపీఎం సీనియర్ నేత సారంగపాణి మృతి



ఖిలావరంగల్, సెప్టెంబరు 26: సీపీఎం సీనియర్ నాయకుడు సుతారి సారంగపాణి(58) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. 38వ డివిజన్ ఖిలావరంగల్ ప్రాంతానికి చెందిన సారంగపాణి 1984 నుంచి సీపీఎం కార్యవర్గ సభ్యుడిగా, శాఖ కార్యదర్శిగా, ప్రజానాట్య మండలి సభ్యుడిగా, ఖిలావరంగల్ మండల శాఖ కార్యదర్శిగా సుమారు 40 సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

భౌతికకాయంపై జిల్లా కార్యదర్శి సీహెచ్. రంగయ్య ఎర్ర జెండా కప్పి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల, సీపీ ఎం రాష్ట్ర నాయకుడు జి.నాగయ్య, ఉమ్మడి జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, హనుమకొండ కార్యదర్శి చక్రపాణి, నాయకులు నలి గంటి అనిల్, గడ్డం రమేష్, పిట్ట మహేందర్, గై ఎల్ల య్య, పి.వేణు, టి.భ వాని, ఇ.రాజు, రాజేష్, జి.రమేష్ తదితరులు మృతుడి కుటుంబా నికి సంతాపం తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు మాస్టర్ చెకప్ కోసం హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరామన్నారు. ప్రతిమ హాస్పిటల్ సిబ్బంది డిస్కౌంట్ కార్డులు అందిస్తే క్రమం తప్పకుండా కార్మికులు పరీక్షలు చేయించుకుంటారని చెప్పారు. శానిటేషన్ సిబ్బంది ప్రతీ ఆర్నెళ్లకోసారి పూర్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. శానిటేషన్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనిచేయడంతో సింహభాగంగా ఉంటారని, వారు నిత్యం చెత్తతో సహవాసం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఇందుకోసం తప్పకుండా వారి పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టీపీవో రాజేశ్ గౌడ్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ప్రతిమ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ అవినాశ్ తిప్పని, డాక్టర్ రాహుల్ నారాయణన్, అంకాలజిస్ట్ డాక్టర్ సుచిత్ర, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 27 సెప్టెంబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

డీసీసీబీని తనిఖీ చేసిన మార్నేని

వర్ధన్నపేట, సెప్టెంబర్ 26 : పట్టణంలోని డీసీసీబీని గురువారం రాష్ట్ర కో-ఆపరేటీవ్ అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్, డీసీసీబీ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కింద లబ్ధిపొందిన రైతులకు తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని, అర్హతగల రైతులకు సంబంధించిన ఇన్‌వ్యాలిడ్ ఆధార్‌లుగా ఉన్నటువంటి ఎర్రర్‌లను ప్రభుత్వ అనుమతితో సరైన ఆధార్ కాపీలు ఇచ్చి లబ్ధిపొందేలా చూడాలని సూచించారు. ఆయన వెంట వర్ధన్నపేట పీఏసీఎస్ ఛైర్మన్ రాజేష్‌ఖన్నా, బ్యాంక్ మేనేజర్ సమత, బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.



బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న రవీందర్‌రావు

చేతి వృత్తులకు ప్రోత్సాహం : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 26 : చేతి వృత్తుల ప్రోత్సాహంలో జిల్లాకు మొదటి స్థానం దక్కేలా కృషి చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పీఎం విశ్వకర్మ పథకం అమలు తీరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత చేతి వృత్తుల ప్రోత్సాహం కింద పీఎం విశ్వకర్మ పథకానికి వడ్రంగి, కమ్మరి, కౌసలి, మోచీలు, తాళాలు మరమ్మతు చేసేవారు, బీట కమ్మరి, ఔసలి కమ్మరి, మేదరి, ఉప్పరి, ఎరుకలి బొమ్మలు చేసేవారు, చాకలి, మంగలి, పూలు అల్లేవారు, దర్జీ, బెస్త తదితర వృత్తుల వారు అర్హులని తెలిపారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వర్తింస్తుందన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, బీసీ వెల్ఫేర్ అధికారి లలితారెడ్డి, ఎల్‌డీఎం రాజు, మెప్మా పీడీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు

నర్సంపేట, సెప్టెంబరు 26 : పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను గురువారం పిఓఎంహెచ్ఎన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మశ్రీ వైద్యసిబ్బందితో కలిసి డిప్యూటీ డిఎంహెచ్‌వో ప్రకాశ్ తనిఖీ చేశా రు. పట్టణంలోని పావని నర్సింగ్ హోమ్, వందన నర్సింగ్ హోమ్, మమత నర్సింగ్ హోమ్, మల్లిక నర్సింగ్ హోమ్‌లను తనిఖీ చేశారు. డిప్యూటీ డిఎంహెచ్‌వో ప్రకాశ్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలను ప్రైవేటు ఆస్పత్రులు అమలుచేయాలని స్పష్టంచేశారు. ఆస్పత్రులలో రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించామన్నారు. నిబంధనలు పాటించని ఆస్పత్రులను సీజ్‌చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లీల, ఈహెచ్‌ఈ మార్త, నంద తదితరులు పాల్గొన్నారు.



రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

'ఐలమ్మ జయంతి' బ్యానర్ కలకలం

వర్ధన్నపేట, సెప్టెంబర్ 26 : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏర్పాటు చేసిన బ్యానర్‌లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలని ప్రచురించి కింది భాగంలో చాకలి ఐలమ్మ గారి వర్ధంతి సందర్భంగా వారికి ఇవే ఘన నివాళులని ప్రచురించడంతో హాజరైన కాంగ్రెస్ కార్యకర్తల్లో కల కలం స్పష్టించింది. దీనికి తోడు మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ జన్మదిన వేడుకల్లో భాగంగా ప్రచురించిన బ్యానర్‌లో సైతం మన్మోహన్‌సింగ్ జయంతి అని ప్రింట్ చేయడంతో హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన బతికే ఉన్నాడని చర్చలకు దారి తీసింది. దీంతో ఆ ప్రింట్ చేసిన భాగాన్ని మలచి వినియోగించుకోవడం కోస మెరుపు.

'ఎమ్మెల్యే నాగరాజు రాజీనామా చేయాలి'

వర్ధన్నపేట, సెప్టెంబర్ 26 : మాల కుల ఉద్యోగస్తుల సమావేశంలో మాదిగలను కించపరిచేలా, ఏబీసీడీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు వెంటనే రాజీనామా చేయాలని ఎమార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం వర్ధన్నపేట అంబేడ్కర్ సెంటర్‌లో వారు మాట్లాడారు. కార్యకమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గోలి సుధాకర్‌మాదిగ, జిల్లా ధర్మయ్య, బిర్రు గోపాల్, భిక్షపతి, గోలి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పీఏసీఎస్ గోదాములు

దుగ్గొండి, సెప్టెంబరు 26 : రైతులకు సౌకర్యార్థం నిర్మాణం చేసిన వ్యవసాయ గోదాములు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని నాచినపల్లి పీఏసీఎస్ పరిధిలో రెండు గోదాములు నాబార్డు నిధులు రూ.72 లక్షలు మంజూరీ కాగా, నాచినపల్లిలో రూ.36 లక్షలతో 500 టన్నుల సామర్థ్యం గల గోదాము, దాని అనుబంధంగా ఉన్న తిమ్మంపేటలో రూ.36 లక్షలతో 500 టన్నుల సామర్థ్యం గల గోదాములు నిర్మాణం కాబడి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

ఇక రైతులకు అందుబాటులో ఎరువులు

పీఏసీఎస్ ద్వారా రైతులకు కావలసిన అన్ని రకాల ఎరువులను విక్రయించడంతో ఎక్కువ సామర్థ్యం గల గోదాములు లేక పోవడంతో ఎరువుల నిల్వలు తక్కువగా ఉండడంతో రైతులు ఇబ్బంది పడేవారు. 500 టన్నుల సామర్థ్యం గల రెండు గోదాములు నిర్మాణం కావడంతో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఎక్కువ ఎరువులు దిగుమతి చేసి నిల్వ చేస్తారు. నాచినపల్లి సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలో నాచినపల్లి, తిమ్మంపేట, రేకంపల్లి, తొగర్రాయి, పొనకల్, లక్ష్మీపురం, బందంపల్లి, కేశవాపురం, శివాజీనగర్, బిక్కాజిపల్లి గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల రైతులు వారికి కావలసిన ఎరువులు తీసుకువెళ్తారు. రైతులకు అందుబాటులో సంఘం ఆధ్వర్యంలో అందించడంతో ఎరువులను ఎక్కువ మంది వాడుతున్నారు.





నాచినపల్లి, తిమ్మంపేటలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వ్యవసాయ గోదాములు

గోదాముల్లో ఎరువులు నిల్వ చేయవచ్చు

సుకినే రాజేశ్వర్‌రావు, ఛైర్మన్, పీఏసీఎస్ నాచినపల్లి



రైతులకు అందుబాటులో ఎరువులు ఉంచాలనేలక్ష్యంతో నాబార్డు సంస్థ గోదాముల నిర్మాణం కోసం నిధులు మంజూరీ చేశారు. గోదాముల నిర్మాణంతో ఎక్కువ ఎరువులు నిల్వచేసి రైతులకు అందిస్తాం. గ్రామాల్లోనే ఏ సీజన్‌లోనైనా ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకు అందిస్తాం. గతంలో చిన్న చిన్న గోదాములు ఉండగా ఎక్కువ ఎరువుల స్టాక్ నిల్వ చేయడం ఇబ్బందిగా ఉండేది. గోదాముల నిర్మాణంతో ఇబ్బంది తప్పుతుంది. ఎక్కువ సామర్థ్యం గల గోదాములు మంజూరీ కావడం రైతులకు సౌకర్యార్థంగా ఉంటుంది.

నెక్కొండ మునిసిపాలిటీ ఏర్పాటుకు గ్రామాల వివరాలు ఇవ్వండి



జడ్పీ సీఈవో రామిరెడ్డికి వివరాలు తెలుపుతున్న కార్యదర్శి

నెక్కొండ, సెప్టెంబరు 26 : నెక్కొండ పట్టణాన్ని మునిసిపాలిటీగా ఏర్పాటు చేయడానికిగాను నెక్కొండలో విలీనం చేయనున్న గ్రామాలకు సంబంధించి సమగ్ర సమాచారం అందించాల్సిందిగా జడ్పీసీఈవో, ఇన్‌చార్జ్ డీపీవో రామిరెడ్డి ఆదేశాలను జారీ చేశారు. గురువారం నెక్కొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. మునిసిపాలిటీ ఏర్పాటుకు సంబంధించి నెక్కొండ, చెన్నారావుపేట మండలాల అధికారులు తహసీల్దార్, ఎంపీడీవో, ఏవో, ఏఈపీఆర్‌లు వారికి శాఖలకు సంబంధించిన వివరాలు అందించాల్సిందిగా ఆదేశించారు. నెక్కొండ పట్టణంలో విలీనమయ్యే నెక్కొండ, చెన్నారావుపేట మండలాల్లోని గ్రామాలకు సంబంధించి రెవెన్యూ రికార్డులు, విస్తీర్ణం, జనాభా, గృహాల సంఖ్య, ఉపాధిహామీ జాబ్‌కార్డుల వివరాలు, బడ్జెట్ వివరాలు, వ్యవసాయ సాగు విస్తీర్ణం, ఈ గ్రామాలకు నెక్కొండకు మధ్య దూరం తదితర అంశాలకు సంబంధించిన వివరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్, డీటీసీటీవో రత్నకుమారి, కార్యదర్శి సదానందం పాల్గొన్నారు. కాగా, నెక్కొండ మునిసిపాలిటీగా ఏర్పాటు చేయడానికిగాను నెక్కొండ మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాలైన గుండ్రపల్లి, పత్తిపాక, నెక్కొండతండా, చెన్నారావుపేట మండలంలోని రెవెన్యూ గ్రామాలైన అమీన్‌పేట, టీకే తండాలను కలపాలంటూ ప్రతిపాదనలు పంపించారు.

ఆనందాశ్రయంలో వృద్ధులకు క్రీడా పోటీలు

గీసుగొండ, సెప్టెంబరు 26: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా 15వ డివిజన్ గొర్రెకుంట ఆనందాశ్రయంలో గురువారం వృద్ధులకు క్రీడా పోటీలు నిర్వహించారు. వృద్ధులు ఉల్లాసంగా చెస్, మ్యూజికల్ చైర్, రన్నింగ్, డ్యాన్స్, పాటల పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలుజరిగాయి. కాగా, ఆటల పోటీలను సీడీపీవో విద్య ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అరుణాదేవి, హేమలత, అనిరుధ్ యాదవ్, మల్లారెడ్డి, రాజేంద్రప్రసాద్, ఎలగందుల అమృత స్మారక ఓల్డేజ్, లావణ్య ఓల్డేజ్ హోమ్‌లలోని వృద్ధులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

వర్ధన్నపేట, సెప్టెంబర్ 26: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు వర్ధన్నపేట పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాగరాజు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎద్దు సత్యానారాయణ, అంగోతు అరుణ, అన్వర్, సమ్మెట సుదీర్,మైస సురేష్, విలువేరు శ్రీధర్‌యాదవ్, పులి శ్రీనివాస్, రాయపురం సాంబయ్య పాల్గొన్నారు.

తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్ వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లందుల సాంబయ్య మాట్లాడుతూ ఆమె జీవిత చరిత్ర, పోరాట ప్రతిమ, చేసిన త్యాగం తీరును కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లందుల అరెల్లిప్రభాకర్, ఒడ్డుపెల్లి కృష్ణ, చంద్రమౌళి, కుడికందుల రాజు, పొన్నం ప్రభాకర్, లొంక ఐలయ్య, వెంకటయ్య, బాలయ్య, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో తూళ్ల కుమారస్వామి,మార్గం భిక్షపతి, సిలువేరు కుమారస్వామి, తోటకూరి రాజమణి, బానోతు అనిత శ్రీనివాస్, ఎరుకొండ వేణుగోపాల్‌రావు, వసంత్ నాయక్, వెంకన్ననాయక్, గొదుమల మధు, తోటకూరి శ్రీధర్, పట్టిల రాజు, మైస వీరేందర్ పాల్గొన్నారు.

- నర్సంపేట : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలిఐలమ్మ జయంతి వేడుకలను నర్సంపేటలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, బీసీ సంఘాలనాయకులు మండలశ్రీనివాస్, పుట్టపాక కుమారస్వామి, దేవోజు సదానందం, మచ్చిక రాజు గౌడ్, శీలం వీరన్న, నూకల కృష్ణమూర్తి, నాడెం సాంబయ్య, పుల్లూరు కుమారస్వామి, సంఘం మహిళా అధ్యక్షురాలు వరంగంటి కవిత, డివిజన్ అధ్యక్షురాలు గాదం స్వప్న, కొమ్ము శ్రీకాంత్, పొనగంటి రాజు, రాజేశ్ పాల్గొన్నారు. అలాగే రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి డాక్టర్ గోపాల్, ఎన్ఆర్ఐ శానబోయిన రాజ్‌కుమార్, తడిగొప్పుల మల్లేష్, కొల్లూరి లక్ష్మీనారాయణ, పుట్టపాక రవి, చౌదారపు మధు, సాంబరాతి మల్లేశం, ప్రవీన్, మామిడాల నర్సయ్య, రాయరాకుల శ్రీను, చింతం విజయరాణి, కందిపల్లి శంకర్, మేకల రాజ్‌కుమార్, పొదిల రాంచందర్, దిలీప్, ఐలోని శ్రీనివాస్, గుడికందుల సదానందం, కొల్లూరి హరి, కొల్లూరి శ్రీహరి, కొల్లూరి మధుకర్, రణధీర్, రాయరాకుల శ్రీనివాస్, నెల్లుట్ల శివ పాల్గొన్నారు. ఐలమ్మ విగ్రహానికి డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గడ్డమీది బాలకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

- దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయులు తెలంగాణ సాయుధ పోరాట యోదురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కాళీదాసు, ఉపాధ్యాయులు మన్నె బాబు, నరేందర్, ఊర్మిల, ఇంద్రాసేనా రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.
- నెక్కొండ: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను హై స్కూల్ సెంటర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు రామారపు వీరస్వామి, బొడ్డుపెల్లి రాజు, రామారపు రాము, విజేందర్, సుమన్, పొట్లపల్లి సురేష్, కోడూరి నాగరాజు, శ్రీశైలం, లింగయ్య, బిక్షపతి, రామస్వామి, వెంకన్న, లింగమూర్తి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.
- చెన్నారావుపేట : చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల రజక సంఘం కుల పెద్ద చాపర్తి రాజు, ఎంసీపీఐయూ మండల కార్యదర్శి జన్ను రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలోఎన్ హెచ్‌ఆర్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగం రమేష్, మర్రి మధుకర్, ఎడ్ల కుమార్, మల్లయ్య, వంశీ, ప్రసాద్, ఈగ సత్యనారయణ, దేవి, శిరీష, గీత, స్పందన,రాధిక, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.
- రాయపర్తి : చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు మండల కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. మండల ఉపాధ్యక్షుడు భూక్యా సమ్మయ్య నాయక్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు మచ్చ రమేష్, నాయకులు దేవేందర్, సోము, భిక్షపతి, లక్ష్మణ్, చేరాలు పాల్గొన్నారు.
- సంగెం : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి పేదలకు పండ్లు పంచారు. కార్యక్రమంలో కోటేశ్వర్, రమేష్, మోహన్, వెంకట్రాజం, యువరాజు, సదానందం, రాములు, శ్రీనివాస్, శంకర్, చొక్కయ్య, భద్రయ్య, రవి, ఉమాకర్, ఎల్లయ్య, పద్మ, సరోజన, దామోదర్ పాల్గొన్నారు.
- గీసుగొండ : మండలంలోని పలు గ్రామాల్లో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. గీసుగొండలో ఐలమ్మ చిత్రపటానికి రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కారొబార్ అలీ, రజక సంఘం నాయకులు శ్రీనివాస్, రాజ్‌కుమార్, సుధాకర్, రాజమౌళి, వరుణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.
- పర్వతగిరి : చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మండలంలోని చింతనెక్కొండలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఐలమ్మ విగ్రహం వద్ద గ్రామీణ హితకారిణి సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గటికె మల్లయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు చలపతిరావు, గురువారావు, శ్రీనివాస్, రాములు, శ్రీధర్, స్వామి, యాలాద్రి, సాయిలు, రఘు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



నర్సంపేట ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 26 : గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ నర్సంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గురువారం స్థానిక ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నామాల సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేస్తే బిల్లులు రాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె. రవి, శ్రీలత, కోమల, కళమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

- నెక్కొండ : అభివృద్ధి పనులు చేయండి లేకపోతే సస్పెండ్ చేస్తామంటూ గ్రామాల సర్పంచ్‌గా ఉన్న కాలంలో ఉన్నతాధికారుల తమను బెదిరించడంతో అప్పులుచేసి పనులు చెసినా బిల్లులు రాక చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక పోతున్నామంటూ మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. అమ్మడానికి ఇండ్లలో వస్తువులులేవని మార్కెట్‌లో విక్రయించడానికి తమ శరీరావయవాలు మాత్రమే మిగిలాయంటూ విచారం వ్యక్తం చేశారు. వెంటనే బిల్లులు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఎంపీడీవో దయాకర్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మాదాసు అనంతలక్ష్మిరవి, అలకుంట సురేందర్, లావుడ్యా హరికిషన్, బొంపెల్లి రాజేశ్వర్‌రావు, స్వరూపరవి, విజయమోహన్‌రెడ్డి, సుదర్శన్, లింగాల విజయవెంకన్న, మాలోతు పూర్ణ, ఆరవింద్ , కుమార్, వీరునాయక్, సింగారపు గీతాభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
- ఖానాపురం : అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని తాజా మాజీ ప్రజాప్రతినిధులు గురువారం ఎంపీడీవో భారతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బాషబోయిన ఐలయ్య, కందిక నరేష్, హట్యా భూక్య పద్మావతివెంకన్న, మాజీ ఎంపీటీసీలు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- చెన్నారావుపేట : గతంలో గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌లు గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన చేస్తు నిరసన వ్యక్తంచేశారు. మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య మాట్లాడారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రంను ఎంపీడీవో శ్రీవాణికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శారదగణేష్, బద్దునాయక్, అంద్ర బాలజ్యోజి, మాజీ ఎంపీటీసీ కడారి సునిత సాయిలు, రజిత వీరన్న, సారంగం, వీరాసింగ్, బిక్షపతి, రమేష్, శ్రీను, రాజన్నగౌడ్ పాల్గొన్నారు.
- నల్లబెల్లి : సర్పంచుల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నానబోయి న రాజారాం అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం ఎంపీడీవో కు సర్పంచులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పం చులు చింతపట్ల సురేష్, లావుడ్య తిరుపతి, చీకటి ప్రకాష్, సిద్దూరి రత్నాకర్, ఊరటి అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం

- ఆగివున్న లారీని ఢీకొట్టిన మరో లారీ
- ఇద్దరి మృతి.. మృతుల్లో ఒకరు వరంగల్ వాసి



మృతుడు యాదగిరి

బంగారుపాళ్యం (చిత్తూరు), సెప్టెంబరు 26 : ఏపీలోని చిత్తూరు జిల్లాలో జరిగిన రోడ్డుప్రమాదంలో వరంగల్‌కు చెందిన ఓ లారీ క్లీనర్ మృతిచెందాడు. గురువారం తెల్లవారుజామున చిత్తూరు జిల్లా బంగా రుపాళ్యం సమీపంలోని మొగిలి ఘాట్‌లో ఈ ప్రమాదం జరిగింది. వి.కోట నుంచి కట్టెల లోడుతో భద్రాచలం వెళ్తున్న ఓ లారీ బుధవారం మధ్యాహ్నం మొగిలి ఘాట్ వద్దకు మరమ్మతులకుగురైంది. దీంతో ఆ లారీని రోడ్డు పక్కనే ఆపి డ్రైవర్,క్లీనర్ విశ్రాంతి తీసుకున్నారు.అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో బెంగళూరు నుంచి పంచదార లోడుతో వెళ్తున్న మరో లారీ అదుపుతప్పి అతివేగంతో ఆగివున్న లారీని ఢీకొంది. దీంతో ఆగివున్న లారీ డీజల్ ట్యాంకు పగిలి మంటలు చెలరేగిదగ్ధమైంది. డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు, చిత్తూరు, పలమనేరు అగ్నిమాపక సిబ్బందికి అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఎక్స్‌కవేటర్ సాయంతో లారీలో వున్న కట్టెలను తొలగించారు. కాలిన లారీకింద ఆ లారీడ్రైవర్ జామిశెట్టి రామరాజ్(50) పూర్తిగా కాలిపోగా క్లీనర్ గాయపడ్డాడు. చక్కెరలోడు లారీలోని క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన తెలంగాణరాష్ట్రం మిర్యాలగూడకుచెందిన డ్రైవర్ సాయికృష్ణ(31),వరంగల్‌కు చెందిన క్లీనర్ యాదగిరి (50)లనుఎక్స్‌కవేటర్‌సాయంతో బయటకుతీయగా యాదగిరి అప్పటికే మృతిచెందాడు. గాయపడిన సాయికృష్ణను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు మాస్టర్ చెకప్ కోసం హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరామన్నారు. ప్రతిమ హాస్పిటల్ సిబ్బంది డిస్కౌంట్ కార్డులు అందిస్తే క్రమం తప్పకుండా కార్మికులు పరీక్షలు చేయించుకుంటారని చెప్పారు. శానిటేషన్ సిబ్బంది ప్రతీ ఆర్నెళ్లకోసారి పూర్తి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. శానిటేషన్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనిచేయడంతో సింహభాగంగా ఉంటారని, వారు నిత్యం చెత్తతో సహవాసం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఇందుకోసం తప్పకుండా వారి పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టీపీవో రాజేశ్ గౌడ్, డీఎఫ్‌వో శంకర్ లింగం, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ప్రతిమ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ అవినాశ్ తిప్పని, డాక్టర్ రాహుల్ నారాయణన్, ఆంకాలజిస్ట్ డాక్టర్ సుచిత్ర, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధుడి ఆత్మహత్య

పర్వతగిరి, సెప్టెంబరు 26 : అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వడ్లకొండలో గురువారం జరిగింది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అలుగునూరి సమ్మయ్య(76) బీపీ, షుగర్‌తో బాధపడుతుండగా, దీనికితోడు 20రోజుల క్రితం ఊపిరితిత్తుల సమస్య మొదలై టీబీ వచ్చింది. నిత్యం మందులు వాడుతూ ఆర్థికంగా సైతం ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం పింఛను తీసుకుని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి గ్రామ శివారులో ఉన్న మామిడితోటలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతుడి భార్య భాగ్యమ్మ ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడి మరొకరు..

పర్వతగిరి, సెప్టెంబరు 26 : ప్రమాదవశాత్తూ బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అన్నారం షరీఫ్‌లో జరిగింది. గురువారం ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గుంజ అబ్బయ్య(86) వివాహం కాకపోవడంతో తన అన్న మనమడి ఇంట్లో ఉంటూ గ్రామంలో చిన్నపాటి పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 23న ఉదయం బహిర్భూమికని వెళ్లి తిరిగిరాలేదు. గ్రామంలోని బంధువుల ఇళ్లతో పాటు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదు. కాగా, గ్రామానికి చెందిన కుందూరు రాంరెడ్డికి చెందిన బావిలోనుంచి వాసన వస్తుండగా గురువారం ఉదయం పలువురు గ్రామస్థులు వెళ్లి చూడడంతో అబ్బయ్య మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతిచెందాడని మృతుని అన్న మనవడు గుంజ వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బస్సు


వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 26 : ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టడంతో దంపతులకు గాయాలైన సంఘటన మండలంలోని ఉప్పరపెల్లి క్రాస్‌రోడ్డు వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని ఇల్లందకు చెందిన సట్ల హరీష్, కల్యాణి దంపతులు ద్విచక్ర వాహనంపై వరంగల్‌కు వెళ్తుండగా, వరంగల్ నుంచి సూర్యాపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీని ఓవర్ టెక్ చేసి వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. దీంతో వారిని వెంటనే వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

జాతీయ రహదారిపై కారు బీభత్సం

వర్ధన్నపేట, సెప్టెంబర్ 26 : పట్టణంలో ని అంబేడ్కర్ సెంటర్ వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై గురువారం కారు బీభత్సం సృషించింది. అతివేగంతో వస్తూ ఓ బాలుడుని తాకుకుంటూ అదుపుతప్పి ఆటోను ఢీకొట్టి, అదే వేగంతో సైకిల్‌పై వెళ్తున్న భూమా వెంకన్నను ఢీ కొట్టింది. దీంతో అక్కడ ఉన్న ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి యత్నించడంతో కారులో ప్రయాణిస్తున్న నాలుగురు వ్యక్తులు కారును వదిలేసి పరారయ్యారు. గాయపడిన వెంకన్నను స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తలకు తీవ్రగాయమైందని మెరుగైన వైద్యానికి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించడంతో 108 ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

పాపయ్యపేట రోడ్డుపై కుంగిన కల్వర్టు

చెన్నారావుపేట, సెప్టెంబరు 26 : మండలంలోని పాపయ్యపేట గ్రామం ప్రధాన రహదారిపై శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టును అధికారులు గురువారం పరిశీలించారు. అర్అండ్‌బీ ఏఈ సతీష్ మాట్లాడుతూ ఈ కల్వర్టుతో ప్రమాదం పొంచి ఉందన్నారు. కల్వర్టులకు మరమ్మతులు చేపట్టే వరకు భారీ వాహనాల రాక పోకలను నిలిపివేస్తామ న్నారు. గ్రామస్థులు, వాహనదారులు గమనించి సహకరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, కాంట్రాక్టర్ అజయ్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, మేడి సంతోష్ పాల్గొన్నారు.



కల్వర్టును పరిశీలిస్తున్న అధికారులు